

మరొక పక్క నరహరితో పాటు పార్టీ మారాలనుకున్న ఇరవై మంది ఎమ్మెల్యే లను స్పీకర్ కాంటాక్ట్ చేశాడు.

వారు పార్టీ మారిన మరుక్షణం వారి ఎమ్మెల్యే పదవి 'పార్టీ మార్పిడి నిరోధక చట్టం' కింద రద్దు చేయబడుతుందని స్పీకర్ వివరించాడు. ప్రభుత్వానికి కావల సిన మెజారిటీ అప్పటికి ఉన్న ఎమ్మెల్యేల నుండి లెక్కిస్తారు. కాబట్టి వారు పార్టీ మారటం వలన వారి పదవులు ఊడటం తప్ప మహేష్ ప్రభుత్వం పడిపోదని కూడా వివరించాడు. అంతేకాకుండా వారి వారి నియోజకవర్గాల్లో వెంటనే వచ్చే ఎన్ని కల్లో ప్రభుత్వాన్ని ఎదిరించి గెలిచే సామర్థ్యం ఉందో, లేదో మరోసారి ఆలో చించుకోమని అన్యాపదేశంగా బెదిరిం చాడు. దానితో ఆ ఇరవై మంది ఎమ్మె ల్యేలు అయోమయంలో పడ్డారు. వారికి సలహా ఇచ్చే కొంతమంది ముఖ్యులు అరెస్టయి అందుబాటులో లేకుండాపో యారు.

అంతపేరున్న ముఖ్యమంత్రితో గొడవ పడి సాధించేదేమిటో వారికే అర్థం కాలేదు. తాము పార్టీ మారటం వలన



నరహరి లాంటి కుహనా రాజకీయ నాయకులకు తప్ప తమ కేమీ లాభం ఉండదని వారు ఆలోచించుకున్నారు. అందుకే వెంటనే ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్ళారు. తామంతా నరహరి ప్రోద్బలంతో ఈ పనిచేశాం తప్ప పార్టీ మారే ఉద్దేశం తమకి లేదని తేల్చి చెప్పారు.

గవర్నర్ పిలుపుకు రెస్పాండ్ అవుతూ ముఖ్యమంత్రి ఆ రాత్రి గవర్నర్ అధికార నివాసానికి వెళ్ళి ఆయన్ని కలుసుకున్నాడు.

"మధ్యాహ్నం కొంతమంది ఎమ్మెల్యేలు వచ్చారయ్యా! నీకు మద్దతు ఉపసంహరించుకుంటున్నామన్నారు. అందుకే పిలిపించవలసి వచ్చింది" అన్నాడు గవర్నర్.

"వీళ్ళేనా సర్, వారు? " తన వెనుక వచ్చిన కార్ల నుండి దిగుతున్న ఎమ్మెల్యేలను చూపిస్తూ అడిగాడు మహేష్.

వాళ్ళను చూసి తన కళ్లను తనే నమ్మలేకపోయాడు గవర్నర్. "నువు రాజకీయాలు చాలా త్వరగా నేర్చుకున్నావోయ్" అన్నాడాయన ఆప్యాయంగా.

"ఇంతకీ నేను వచ్చింది మీకు ఒక విషయం చెప్పటానికి. నేను నరహరిని మంత్రివర్గం నుండి తొలగిస్తున్నాను. అతనికి బదులుగా ఈ ఇరవై మందిలో ఇద్దరిని మంత్రివర్గంలోకి తీసుకుంటున్నాను. దయచేసి ఆమోదించండి"

ఆ తరువాత మాట్లాడుకోవటానికి పిచ్చాపాటీ తప్ప వారిమధ్య మరేమీ లేకపోయింది.

మరొక అరగంట తరువాత పానకాలు ఆ రోజు రెండోసారి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాడు. ముఖ్యమంత్రిలాంటి ఉత్తముడు టెండర్ ఫైలు మీద సంతకం పెట్టింది తను కాదని ప్రకటించాక ఇక ఆ విషయం పొడిగించడం అనవసరమని అర్థం చేసుకున్నానని ప్రకటించాడు. అపార్థాలు తొలగిపోయాయి కాబట్టి తన సహకారం ప్రభు

త్వానికి యథాప్రకారం కొనసాగుతుందని, దయచేసి తన సహకారాన్ని తిరస్కరించ వద్దని మనవి చేసుకున్నాడు. అంతేకాదు, ముఖ్యమంత్రికి ఒక మనవి చేసుకుంటు న్నానని చెప్పాడు. అదేమిటంటే ఈ గొడవ వలన ఆలస్యం కాబోతున్న ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ని త్వరగా పూర్తి చేయాలని, తద్వారా తన జిల్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరటం చూడాలన్నదే తన చివరికోరి కనీ చెప్పాడు.

ఆ ప్రకటన చూసిన సలహాదారు ప్రభు ముఖ్యమంత్రికి ఫోన్ చేశాడు. "నిజం చెప్పాలంటే మన పొజిషన్ నిన్నటి కంటే ఇప్పుడే బలంగా ఉంది. ఇప్పుడప్పుడే మిమ్మల్ని ఎవరూ కదపలేరు. కంగ్రాచ్యులే షన్స్"

సన్నగా నవ్వాడు ముఖ్యమంత్రి. ఆ నవ్వులో ఎప్పుడూ లేనిది మొదటిసారి కాస్త గర్వం కనిపించింది.

★ ★ ★

బాగా రాత్రి అయింది. ఆదిత్య, సహదే వుడు నారాయణని గమనిస్తున్నారు.

సినిమా హాలు వద్ద నుండి బయటకు వచ్చిన నారాయణ కాసేపు అటు ఇటూ తిరిగాడు. చేయటానికి ఏమీ కనపడలేదు. ఉదయం భోంచేసిన హోటల్‌కే వెళ్లి మరలా భోంచేశాడు. తిరిగి గుడిసెకు వెళ్లటం తప్ప చేసేదేమీ లేక తన నివాసం వైపు అడుగులు వేశాడు నారాయణ.

ఇక అతన్ని అనుసరించి ఉపయోగం లేదనుకున్న ఆదిత్య, సహదేవుడు అక్కడ మాయమై రోడ్డు మీద వదిలిన ఆదిత్య కారు వద్ద ప్రత్యక్షమయ్యారు.

'ఇప్పటివరకు అది అక్కడ పదిలంగా ఉండటం ఆశ్చర్యమే!' అనుకున్నాడు ఆదిత్య. ఇద్దరూ దానిలో ఆదిత్య ఇంటికి బయలుదేరారు. దారిలో వారి సంభాషణ అప్పటివరకు జరిగిన సంఘటనల మీద సింహావలోకనంలా సాగింది.

"సహదేవుడుగారూ! నన్నెంత భయ పెట్టారండీ! భూప్రపంచమంతా మునిగిపో బోతున్నదన్నంత బిల్డప్ ఇచ్చారు. నిజమే! నేను ముందూ వెనుకా ఆలోచించకుండా అలా ఒకరి సంపదనీ, ఆరోగ్యాన్నీ, తెలివినీ మరొకరికి ఇచ్చి ఉండవలసింది కాదు. నేను ఒప్పుకుంటున్నాను. నాకు ఈ ఆట కొత్త. పూర్తిగా మెళకువలు తెలియవు. కానీ మీ దేవుడికి యుగయుగాల అను భవం ఉంది. నేను చేసిన పొరపాట్లు చెయ్యకుండా సమానత్వం తెమ్మనండి"

"ఏంటి వింతగా మాట్లాడుతున్నావ్? నువు చేసిన పని వలన అంతా మంచే జరిగినట్లూ.. ఇక చేయవలసిందీ, చూడవ లసిందీ ఏమీ లేదన్నట్లూ ఫీలవుతు న్నావా? " గొంతులో వ్యంగ్యాన్ని రంగరిం చి అన్నాడు సహదేవుడు.

"లాభం సంగతి పక్కన పెడితే, జరిగిన నష్టం నాకేమీ కనపడటం లేదు. ఫలితమే ప్రామాణికం అనుకుంటే అంతా మంచే జరిగిందనిపిస్తోంది. నారాయణ ప్రశాం తంగా తనకంటూ ఏర్పరుచుకున్న గూట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. రేపు మిగిలిన డబ్బుల్తో ఏ బడ్డీ కొట్టో, టీ కొట్టో పెట్టు కుని స్థిరపడతాడు. మల్హోత్రాని ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెట్టిన మాట వాస్త వమే! కానీ ఎంతసేపు? తన పలుకుపడి ఉపయోగించి వాటిని అధిగమించబోతు న్నాడు. రేపు బ్యాంకు ఛైర్మన్ ఆదిశేష మల్హోత్రాకి అప్పు ఇస్తాడు. దానితో మల్హోత్రా సమస్యలన్నీ తీరిపోతాయి. అలాగే ప్రకాష్ సింగ్ మరణం నన్ను ఎంతో బాధించింది. నిజమే! నేను ఆయన ఆరోగ్యంతో చెలగాటం ఆడి ఉండవలసింది కాదు. ఆయన ఎంత వృద్ధుడయినా అతని ఆయుష్షు తగ్గించే అధికారం నాకెక్కడిది? కానీ ఆయన మరణం వలన ఆ ఫ్లై ఓవర్లో

డిజైనింగ్ లోపాలున్న విషయం ప్రపంచానికి తెలియక ఏదైనా దారుణం జరుగుతుందేమోనని ఊహించుకున్నాను. కానీ మీరే చూడండి.. అంతా మామూలుగానే ఉంది. వేలాది వాహనాలు ప్రస్తుతం ఆ ఫ్లై ఓవర్ మీద క్షేమంగా ప్రయాణిస్తున్నాయి. ముఖ్యమంత్రి తప్పటడుగు వేసినట్లే కనిపించాడు. అతని ప్రభుత్వం పడిపోతున్నట్లే అనిపించింది. కానీ, చివరకు ఆందోళనలను అణచి వేశారు. నరహరి తప్ప ముఖ్యమంత్రికి దూరం జరిగిన వారందరూ వెనక్కి వచ్చేశారు. ఇంక ప్రభుత్వం పడిపోయేది ఎక్కడ? ఇప్పుడు చెప్పండి.. నేను చేసిన మార్పుల వలన ఏమి నష్టం జరిగింది? " సుదీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చినట్లు అన్నాడు ఆదిత్య.

అంతా విన్న సహదేవుడు "కుక్క తోక వంకర అంటే ఇదే!" అన్నాడు.

చిర్రెత్తుకొచ్చింది ఆదిత్యకి. "నష్టమంటూ జరిగితే నాకే జరిగింది. గొడవల మూలంగా సగం రోజు సినిమాకి కలెక్షన్లు లేకుండా పోయాయి. అయినా నేను బాధ పడలేదు. నేను నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నాను. మీరు చెప్పండి. ఏమి నష్టం జరిగిందో"

"యుగయుగాలుగా ఆ దేవుడే మనిషి కర్మలను నియంత్రించాలా, వద్దా అన్న విషయం తెలియక అయోమయంలో ఉన్నాడు. నీకిచ్చిన గడువు పూర్తికాక ముందే నువు మాత్రం ఒక నిర్ణయానికి వచ్చేసినట్లున్నావు. అయినా నీకు ముందే చెప్పాను. నేను సూక్తులు వల్లించటానికి రాలేదు. జరుగుతున్నది చూడటమే నా బాధ్యత. నీ మాటలే నిజమేమో! ఏ సంగతీ రేపు నేను దేవుడ్ని కలుసుకున్నాక తేల్చుకుంటాను. ఉదయం నుండి నాతో తిరిగి అలసిపోయి ఉంటావు. విశ్రాంతి తీసుకో. రేపు ఉదయాన మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం" అన్నాడు సహదేవుడు.

"రాత్రికి రాత్రి ఉప్పెనలు వస్తాయా? భూకంపాలు వస్తాయా? ఏమి మార్పులు జరుగుతాయి? " రెట్టించాడు ఆదిత్య.

అప్పటికే వారి కారు ఆదిత్య ఇంటికి చేరింది. కారు గేటు ముందు ఆపి సమాధానం కోసం అన్నట్లు సహదేవుడి వైపు చూశాడు ఆదిత్య.

సహదేవుడు ఏమీ మాట్లాడలేదు. నవ్వాడు!

అవును. ఏమీ తెలియని వాడికీ, అన్నీ